www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 11 నవంబర్ 2024
5
ఏలూరు

అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

నివాళులర్పిస్తున్న కృష్ణకుమారి, సిబ్బంది

కుక్కునూరు : విధి నిర్వహణలో అటవీ రక్షణకు ప్రాణాలర్పించిన అటవీ అధికారులను స్మరిస్తూ స్థానిక అటవీ క్షేత్ర కార్యాలయంలో ఆదివారం సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి కె.కృష్ణకుమారి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అటవీ రక్షణకు ప్రాణాలు త్యాగం చేసిన అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం ప్రతి సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 23 మంది అటవీ రక్షణకు ప్రాణాలర్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి టి.కేసరి, ఫారెస్ట్ సెక్షన్ అధికారి కె.పెరుమాళ్ళు, సిబ్బంది పాల్గొన్నారు.

నామినేటెడ్ ఆశలు ఆవిరి

- రెండో జాబితాలోనూ కీలక నేతలకు నిరాశే
- తాజా, మాజీ టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని, తోటకు మొండిచేయి
- ఎంఎల్‌ఎ టిక్కెట్ త్యాగం చేసినా నేతలకు దక్కని గుర్తింపు
- ముద్రబోయిన, వలవల బాబ్జీకి ఝలక్
- టిడిపి, జనసేనలోని పలువురు నియోజకవర్గ నేతల్లో అసంతృప్తి


తోట సీతారామలక్ష్మి | గన్ని వీరాంజనేయులు | ముద్రబోయిన వెంకటేశ్వరరావు | వలవల బాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నామినేటెడ్ పదవులపై గంపెడాశలు పెట్టుకున్న నేతల ఆశలు ఆవిరయ్యాయి. తొలి జాబితాలో రెండు జిల్లాల్లోని కీలక నేతలకు పదవులు దక్కకపోవడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. ఎంఎల్‌ఎ పదవుల త్యాగం చేసిన నాయకులను గుర్తించకపోవడంతో వారి అనుయాయుల్లో తీవ్ర అసంతృప్తి జ్వాలలు రేగుతున్నాయి. కూటమి ప్రభుత్వం కొద్దిరోజుల క్రితం తొలి జాబితాలో కీలక కార్పొరేషన్లకు సంబంధించిన నామినేటెడ్ పదవులను ప్రకటించింది. మంతెన రామరాజు, పీతల సుజాత, బొరగం శ్రీనివాస్‌కు మాత్రమే అవకాశం దక్కింది. కీలక నేతలకు తొలిజాబితాలో చోటు దక్కకపోవడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. రెండో జాబితాలో అవకాశం దక్కుతుందని అంతా సరిపెట్టుకున్నారు. నామినేటెడ్ పదవులకు సంబంధించిన రెండో జాబితా శనివారం విడుదల చేశారు. సామాజిక వర్గాల సంక్షేమం, పలు అభివృద్ధి సంస్థలు, వివిధ కార్పొరేషన్లకు సంబంధించి 62 కీలక పదవులను ప్రకటించడం జరిగింది. రెండు జిల్లాల్లో టిడిపి, జనసేనకు సంబంధించిన నలుగురు నేతలకు అవకాశం దక్కింది. టిడిపిలో కీలకనేతలుగా ఉన్నవారికి మాత్రం మరోసారి మొండిచెయ్యి మిగిలింది. ఎన్నికల వరకూ పశ్చిమగోదావరి జిల్లా టిడిపి జిల్లా ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహించిన తోట సీతారామలక్ష్మికి ఇప్పటి వరకూ ఏ పదవీ దక్కకపోవడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. 2014-19 టిడిపి ప్రభుత్వంలో సీతారామలక్ష్మి రాజ్యసభ ఎంపీగా పనిచేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి, తర్వాత విభజిత పశ్చిమ జిల్లా ఇన్‌ఛార్జిగా చాలాకాలం పనిచేసిన పరిస్థితి ఉంది. కష్టకాలంలో పార్టీని అంటిపెట్టుకుని ఉన్నారు. కీలకమైన నామినేటెడ్ పదవుల్లో ఆమెకు అవకాశం దక్కకపోవడం హాట్ టాపిక్‌గా మారింది. ఆమెకు రాజ్యసభ, లేక ఎంఎల్‌సి పదవి ఏదైనా ఇస్తారా అన్న మరోచర్చ సైతం నడుస్తోంది. ఏలూరు జిల్లా అధ్యక్షునిగా పనిచేస్తున్న గన్ని వీరాంజనేయులుకు మరోసారి మొండిచేయి మిగిలింది. పొత్తులో భాగంగా ఆఖరి నిమిషంలో గన్ని ఉంగుటూరు ఎంఎల్‌ఎ టిక్కెట్ త్యాగం చేశారు. జనసేనకు ఆ టిక్కెట్ కేటాయించారు. దీంతో ప్రభుత్వం రావడంతోనే గన్నికి కీలక పదవి ఇచ్చే అవకాశం ఉంటుందని భావించారు. నామినేటెడ్ పదవులకు సంబంధించిన రెండు జాబితాల్లోనూ గన్నికి నిరాశే మిగిలింది. గన్నికి పదవి ఇచ్చే ఉద్దేశం టిడిపి అధిష్టానానికి ఉందా అన్న అనుమానాలు నెలకొన్నాయి. నూజివీడు నియోజకవర్గ నేత ముద్రబోయిన వెంకటేశ్వరరావుకు టిడిపి ఝలక్ ఇచ్చింది. ముద్రబోయిన సైతం పొత్తులో భాగంగా ఎంఎల్‌ఎ టిక్కెట్ వదులుకోవాల్సి వచ్చింది. రెబల్‌గా నామినేషన్ వేసి అధిష్టానం బుజ్జగించడంతో వెనక్కి తగ్గి విత్‌డ్రా చేసుకున్నారు. ముద్రబోయినకు కీలకమైన నామినేటెడ్ పదవి దక్కుతుందని అంతా అనుకున్నారు. ఆయనకు పదవి దక్కపోవడం నూజివీడు నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ టిక్కెట్ ఆశించిన వలవల బాబ్జీకి పొత్తులో భాగంగా ఆఖరి నిమిషంలో సీటు దక్కలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే ఆయనకు నామినేటెడ్ పదవి ఖాయమన్న చర్చ సాగింది. బాబ్జీకి నిరాశే మిగిలింది. తమ నాయకులకు రెండో జాబితాలోనూ పదవి దక్కకపోవడంతో వారి అనుయాయుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.

నిరాశలో పలు నియోజకవర్గ నేతలు

నామినేటెడ్ పదవులు దక్కపోవడంతో టిడిపి, జనసేనకు చెందిన పలువురు నియోజకవర్గ నేతలు తీవ్ర నిరాశకు గురైన పరిస్థితి నెలకొంది. నరసాపురంలో మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవనాయుడు, జనసేన దెందులూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఘంటసాల వెంకటలక్ష్మి వంటి ఇతర నేతలు ఉన్నారు. టిడిపి ఎంఎల్‌ఎలు గెలిచిన చోట జనసేన నేతలకు, జనసేన గెలిచిన నియోజకవర్గాల్లో టిడిపి నేతలకు సరైన గుర్తింపు లేకుండా పోయిందంటూ ఇరుపార్టీల మధ్య తీవ్ర ఘర్షణలు జరుగుతున్నాయి. దెందులూరు, చింతలపూడి, తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ఇవి తారాస్థాయికి చేరిన పరిస్థితి నెలకొంది. అధికారిక కార్యక్రమాల్లో తమకు గుర్తింపు ఉండడంలేదని, అధికారులు తమను పట్టించుకోవడం లేదంటూ నేతలు అసంతృప్తిలో ఉన్నారు. నామినేటెడ్ పదవులు దక్కితే అధికారులు తమను గుర్తిస్తారని నేతలు భావిస్తున్నారు. పదవులు దక్కకపోవడంతో తీవ్ర నిరాశకు గురైన పరిస్థితి నెలకొంది.

నేడు జెడ్‌పి అత్యవసర సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా పరిషత్ అత్యవసర సమావేశం సోమవారం జరగనుంది. వైసిపి జెడ్‌పిటిసిల కోరిక మేరకు ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. వైసిపి నుంచి గెలిచి జెడ్‌పి ఛైర్మన్‌గా ఉన్న ఘంటా పద్మశ్రీ కొద్దిరోజుల క్రితం టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. దీన్ని వైసిపి జెడ్‌పిటిసిలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పార్టీ ఫిరాయింపుల్లో భాగంగా పద్మశ్రీ జెడ్‌పిటిసి సభ్యత్వాన్ని రద్దు చేసే అనర్హురాలిగా ప్రకటించాలని వైసిపి జెడ్‌పిటిసి సభ్యులు కోరుతున్నారు. దీనిపై జెడ్‌పి సిఇఒకు వినతిపత్రం సైతం ఇచ్చారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్‌లో 48 జెడ్‌పిటిసి సభ్యులు ఉన్నారు. ఇందులో 46 చోట్ల వైసిపి సభ్యులు, ఇద్దరు టిడిపి, జనసేన సభ్యులు ఉన్నారు. రెండు రోజుల క్రితం 31 మంది వైసిపి జెడ్‌పిటిసి సభ్యులు సమావేశమైన జెడ్‌పి ఛైర్మన్‌పై తిరుబాటుకు దిగారు. అత్యవసర సమావేశంలో ఇదే ప్రధాన ఎజెండాగా కొనసాగనుంది. దీంతో జెడ్‌పి అత్యవసర సమావేశం వాడీవేడిగా జరిగే అవకాశం ఉంది.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న 104 ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ వద్ద 104 ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

104 సర్వీసుల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి 104 ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. పని దినాల్లో యాజమాన్యం ఎటువంటి సెలవులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం వల్ల ఆదివారం అయినప్పటికీ ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ 14 సర్వీస్‌లు నిర్వహిస్తున్న ప్రయివేటు ఏజెన్సీలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ప్రయివేటు సంస్థలకు దోచిపెడుతున్నారన్నారు. అందులో పనిచేస్తున్న ఉద్యోగులకు మాత్రం అరకొర వేతనాలు ఇస్తూ, అవి కూడా సకాలంలో ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిరుద్యోగులకు మూడు నెలల వేతనాలు ఇవ్వకపోతే వారి కుటుంబాలు ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. యాజమాన్యం చెల్లించాల్సిన పిఎఫ్, ఇఎస్‌ఐ వాటాలు కూడా ఉద్యోగులతో కట్టించడం అత్యంత దుర్మార్గమన్నారు. గత మూడేళ్లుగా ఇవ్వాల్సిన ఇంక్రిమెంట్ కూడా చెల్లించకుండా యాజమాన్యం ఉద్యోగులను మోసం చేసిందన్నారు. తక్షణం కాంట్రాక్టు ఏజెన్సీని తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే నేరుగా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా 104 సర్వీసులు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని, జిఒ నంబరు 7 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి ఇచ్చిన వాగ్దానాల ప్రకారం ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భరత్, విజయ్, ప్రకాష్, విజయ భూషణ్, ప్రసన్న కుమార్, ఎం.శాలిని, నాగ దుర్గ పాల్గొన్నారు.

నివురుగప్పిన నిప్పే..!

జిల్లాలో అధికార, ప్రతిపక్షాల పార్టీలైన టిడిపి, జనసేన, బిజెపి, వైసిపిల్లో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా మారింది. కూటమిలో పక్షాల మధ్య ఆధిపత్య పేరు నేతలకు తలనొప్పిగా పరిణమిస్తుండగా నామినేటెడ్ పదవుల పందేరం కూడా ఆయా పార్టీలకు ఇబ్బందికరంగానే ఉంది. ఎవరికి వారే తమకు పదవులు కావాలని ఎగబడుతుండడంతో జిల్లా, నియోజకవర్గస్థాయి నేతలు తలలు పట్టుకుంటున్నారు. ఇక వైసిపిలో ఎవరు ఎప్పుడు పార్టీని వీడతారో తెలియక ఎవరికి వారు అభద్రతా భావంలో కొట్టుమిట్టాడుతున్న తరుణంలోనే భీమవరం మాజీ ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ ఇళ్లు, కార్యాలయాలపై ఐటి దాడులు ఆ పార్టీలో కలకలం రేపుతున్నాయి.

జెడ్‌పి ఛైర్‌పర్సన్ అంశం అటు వైసిపిలోనూ, ఇటు టిడిపిలోనూ కలకలం సృష్టిస్తోంది. ఏలూరు కార్పొరేషన్‌లో మేయర్‌తోపాటు మెజార్టీ వైసిపి కార్పొరేటర్లు టిడిపి గూటికి చేరితే ఎటువంటి ఇబ్బందీ లేనట్లు జెడ్‌పి ఛైర్‌పర్సన్‌తోపాటు వైసిపి జెడ్‌పిటిసిలు మెజార్టీ సంఖ్యలో టిడిపి గూటికి చేరి ఉంటే పెద్ద రచ్చ జరిగేది కాదు. అయితే జెడ్‌పి ఛైర్‌పర్సన్, ఆమె భర్త మాత్రమే టిడిపి గూటికి చేరారు. ఈ వ్యవహారమూ మిత్రపక్షాలైన టిడిపి, జనసేన నడుమ మనస్పర్థలకు దారితీసింది. తొలుత జెడ్‌పి ఛైర్‌పర్సన్ దంపతులు టిడిపిలో చేరాలని చూసినా ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న పెదపాడు మండలానికి సంబంధించిన నియోజకవర్గ నేత అభ్యంతరం చెప్పడంతో నిలిచిపోయింది. ఈలోపు జనసేనలో చేరనున్నట్లు జెడ్‌పి ఛైర్‌పర్సన్ దంపతులు అధికారికంగా ప్రకటించడం, దీనిపై టిడిపి అధినాయకులు అప్రమత్తమై ఇటు జెడ్‌పి ఛైర్‌పర్సన్ దంపతులతోపాటు ఆ నియోజకవర్గ ఎంఎల్‌ఎతోనూ మంతనాలు జరిపి ఇరువురిని ఒప్పించారు. దీంతో జెడ్‌పి ఛైర్‌పర్సన్ దంపతులు టిడిపి గూటికి చేరారు. తమ పార్టీలో చేరేవారిని అడ్డుకుని మీ పార్టీలో చేర్చుకోవడమేంటని జనసేన శ్రేణులు టిడిపి నేతలపై అసంతృప్తి వ్యక్తం చేశాయి. తర్వాత నియోజకవర్గస్థాయిలో ఇరు పార్టీల నేతల మధ్య ఆధిపత్య పోరు పెరిగింది. నామినేటెడ్ పదవులతోపాటు మద్యం దుకాణాలు, బెల్టుషాపుల విషయంలో రచ్చ చోటుచేసుకుంది. అయితే ఇరుపక్షాలు విమర్శ ప్రతివిమర్శలకు దిగకుండా సంయమనం పాటిస్తున్నారు. దీంతో టిడిపి, జనసేన మధ్య సఖ్యత నివురుగప్పిన నిప్పులా మారిందని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఇక వైసిపిలోనూ పరిస్థితి అలానే ఉంది. గత ఎన్నికల్లో ఓటమి తర్వాత పూర్తి నైరాశ్యంలో కూరుకుపోయిన ఆ పార్టీ శ్రేణులు ఇప్పుడు ఎప్పుడూ ఎవరు పార్టీని వీడతారో తెలియక, మరోపక్క ఎవరిపై అధికారపక్షం నుంచి ఎటువంటి దాడులు జరుగుతాయో అర్థంగాక తలలు పట్టుకుంటున్నాయి. వైసిపికి చెందిన మాజీ ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ పార్టీ మారతారనే ప్రచారం సుమారు రెండు నెలలుగా సాగుతోంది. దీనిపై వైసిపి మాజీ మంత్రులు కూడా రంగంలోకి దిగి గ్రంధి శ్రీనివాస్‌ను బుజ్జగించేందుకు ప్రయత్నించారు. అయినా గ్రంధి టిడిపి వైపు అడుగులు వేసినట్లు సమాచారం. టిడిపి అధిష్టానం గ్రంధి చేరికకు ఆమోదం తెలిపినా పదవి కేటాయింపుపై సందిగ్ధత నెలకొన్నట్లు ప్రచారం సాగుతోంది. ఇదే సమయంలో గ్రంధి ఇల్లు, వ్యాపార సముదాయాలపై, ఆయన సన్నిహితులుగా పేరొందిన వ్యాపారుల ఇళ్లపై ఐటి అధికారులు దాడులు నిర్వహించడం కలకలం రేపింది. పైగా మూడు రోజులుగా ఐటి అధికారులు నిర్బంధ తనిఖీలు సాగించడం చర్చనీయాంశమైంది. ఈ పరిస్థితులు వైసిపి నేతలను, కార్యకర్తలను తీవ్ర కలవరానికి గురి చేస్తున్నాయనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

పేదలపై యుద్ధమా..!

పశ్చిమగోదావరి జిల్లా మండల కేంద్రమైన ఆకివీడులోని ఐ.భీమవరం రోడ్డులో రోడ్డు పక్కనే ఇళ్లు వేసుకుని దశాబ్దాలకాలంగా జీవనం సాగిస్తున్న పేదలపై కూటమి ప్రభుత్వం, నేతలు యుద్ధం ప్రకటించినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. పేదలకు ప్రత్యామ్నాయ స్థలాలు చూపకపోవడం, చూపిన స్థలాల్లో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో పేదలు తమ ఇళ్ల తొలగింపుకు మూడు నెలలు గడువు కోరారు. దీనిపై నగర పంచాయతీ ప్రజాప్రతినిధుల నుంచి ఎంఎల్‌ఎ వరకూ, ఆ నగర పంచాయతీ కమిషనర్ నుంచి కలెక్టర్ వరకూ అందరినీ కలిసి వినతులు అందించి తమ గోడు చెప్పుకున్నారు. ఏమైందో ఏమోగాని పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో మౌలిక సదుపాయాలు కల్పించకుండానే పేదల ఇళ్ల తొలగింపు చేపట్టారు. దీన్ని పేదలు సిపిఎం ఆధ్వర్యాన అడ్డుకోవడంతో అధికారులు వెనక్కితగ్గారు. అయితే ఎలాగైనా పేదల ఇళ్లు కూల్చివేయాలనే ఆలోచనతో ఎంఎల్‌ఎ ఆదేశాలతో విద్యుత్ శాఖాధికారులు ఆయా ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు తొలగించడం తీవ్ర చర్చనీయాంశమైంది. వారేమీ సంఘ విద్రోహులు కాదు.. పరాయి దేశస్తులు అంతకన్నా కాదు.. అక్కడే పుట్టి నివసించేందుకు జాగా లేక రోడ్డు పక్కన గుడిసె వేసుకుని జీవిస్తున్న నిరుపేదలు వారు. అవేమీ పట్టని కూటమి పాలకులు అత్యంత అమానవీయంగా ఇళ్లకు కరెంటు కట్ చేసి నిరుపేదలను అక్కడ నుంచి తరిమేసే ప్రయత్నం చేయడం అత్యంత బాధాకరమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

- వివిఎస్‌వి.ప్రసాద్

నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి జరగనున్నాయి. తొలిరోజు పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. దీంతో జిల్లా అభివృద్ధికి సంబంధించి నిధుల కేటాయింపుపై సర్వత్రా చర్చ జరుగుతోంది. చింతలపూడి, తాడిపూడి సాగునీటి ప్రాజెక్టులకు, పోలవరం నిర్వాసితుల సమస్య, కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణం, ఫిషింగ్ హార్బర్, డెల్టా ఆధునికీకరణకు నిధులు కేటాయింపుపై, ఆక్వా, పామాయిల్, వరి రైతులకు ప్రోత్సాహాలపైనే జిల్లా ప్రజానీకం గంపెడాశలు పెట్టుకున్నారు.

ఏలూరు మెడికల్ కాలేజీకి ఎల్లాప్రగడ సుబ్బారావు పేరు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు మెడికల్ కాలేజీకి ఎల్లా ప్రగడ సుబ్బారావు పేరు పెడుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైద్య విభాగాల్లో కీలక ఆవిష్కరణలు చేసిన ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ ఎల్లా ప్రగడ సుబ్బారావు. ఆయన స్వస్థలం భీమవరం, రాజమండ్రిలో చదువుకున్నారు. దీంతో కొత్తగా ఏర్పాటైన ఏలూరు, రాజమండ్రి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఒక దానికి ఆయన పేరు పెట్టాలని ఇటీవల డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ కోరారు. అందులో భాగంగానే ఏలూరు మెడికల్ కాలేజీకి ఆయన పేరు పెట్టినట్లు తెలుస్తోంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో అవస్థలు

సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి రవి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రవి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. సిపిఎం ఆరో నూజివీడు మండల మహాసభ పి.బోస్ అధ్యక్షతన పల్లెలమూడి గ్రామంలో ఆదివారం జరిగింది. ఈ మహాసభలో సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వరంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ కంపెనీలకు, పెట్టుబడిదారులకు కట్టబెడుతోందన్నారు. రైతులకు నష్టం కలిగించే నూతన వ్యవసాయ చట్టాలు తీసుకొచ్చి కార్పొరేట్ కంపెనీలకు మేలు చేయాలని చూస్తోందని విమర్శించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి, లేబర్ కోడ్ తీసుకొచ్చి కార్మికులకు నష్టం చేయాలని చూస్తోందన్నారు. అలాగే మతోన్మాదాన్ని రెచ్చగొట్టి ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టాలని చూస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలపై అధిక భారాలు వేయటం తప్ప ఇంత కాలంలో చేసింది ఏమీ లేదని ధరలు అరికట్టడంలో విఫలమైందని విమర్శించారు. ఉచిత ఇసుక అందించే విధానం సక్రమంగా లేదని, అలాగే ట్రూఅప్ ఛార్జీల పేరుతో కరెంట్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారాలు వేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు, సిపిఎం జిల్లా నాయకులు కె.శ్రీనివాస్, నూజివీడు పట్టణ కార్యదర్శి ఎన్ఆర్.హనుమాన్లు, సిపిఎం నాయకులు పాల్గొన్నారు. అనంతరం నూతన పెనామే కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా పి.బాస్, కమిటీ సభ్యులుగా సామ్యూల్, ఆర్.ప్రసాద్, చల్లారి శ్రీమన్నారాయణను ఎన్నుకున్నారు.

జమిలి ఎన్నికలు ఫెడరల్ వ్యవస్థకు భంగం

టిడిపి, జనసేన, వైసిపిల వైఖరి వెల్లడించాలి

ప్రజా పోరుయాత్రలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ఏలూరు అర్బన్ : మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జమిలి ఎన్నికలు భారతదేశ ఫెడరల్ వ్యవస్థకు భంగం కలిగిస్తాయని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ప్రజా పోరు యాత్ర ఆదివారం ఏలూరులో వెంకటాపురం పంచాయతీ పరిధిలో 19వ డివిజన్ హనుమాన్ నగర్, ఎన్‌టిఆర్ కాలనీ, సుందరయ్య కాలనీ, శ్రీనివాస్ నగర్, శ్రీగార్డెన్స్, హరిప్రియ నగర్, కొత్తూరు ఇందిరమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో సాగింది. ఈ యాత్రలో పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తన మతోన్మాద ఆర్‌ఎస్‌ఎస్ విధానాన్ని ముందుకు తీసుకెళ్తుందన్నారు. తాజాగా నరేంద్ర మోడీ ఒకే దేశం ఒకే ఎన్నిక అనే పల్లవి అందుకున్నారన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ తన మూల సిద్ధాంతంలో భారతదేశంలో ఒకే మతం ఒకే భాష ఉండాలని కోరుతుందని తెలిపారు. ఇప్పుడు ఒకే దేశం ఒకే ఎన్నిక విధానం అమలు కావడం అంటే భారతదేశ ఫెడరల్ వ్యవస్థకు తీవ్ర విఘాతం కలుగుతుందని హెచ్చరించారు. జమిలి ఎన్నికల విధానంపై రాష్ట్రంలో టిడిపి, జనసేన, వైసిపిలు తమ వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గత ఎన్నికల ముందు వైసిపి పాలనపై బాదుడే బాదుడు అని నిరసన తెలిపిన తెలుగుదేశం ఇప్పుడు అధికారంలోకి రాగానే రూ.ఎనిమిది వేల కోట్ల కరెంటు ఛార్జీలు పెంచి అదే దారిలో నడుస్తుందని విమర్శించారు. సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడుతూ గ్రీన్ సిటీ, శ్రీనివాస్‌నగర్, సుందరయ్య కాలనీ, కొత్తూరు ఇందిరమ్మ కాలనీ ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని డిమాండ్ చేశారు. హనుమాన్ నగర్, ఎన్‌టిఆర్ కాలనీ, వెంకటాపురం పంచాయతీ పరిధిలో ప్రజలకు తాగునీరు అందటం లేదని, ఈ ప్రాంతాల్లో సుద్ద నీరు వస్తుందని తెలిపారు. గత మున్సిపల్ ఎన్నికల ముందు పంచాయతీని మున్సిపాలిటీలో కలపడం ద్వారా గోదావరి జలాల నీరు అందిస్తామని హామీ ఇచ్చారని, నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఎ.శ్యామలారాణి, కె.లెనిన్, నగర నాయకులు వి.సాయిబాబు, బి.జగన్నాధరావు, వివిఎన్.ప్రసాద్, ఎస్.సత్యనారాయణ, జి.శారద, కె.నాగమణి, వి.లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

పడమర వీధి, సుబ్రహ్మణ్యం కాలనీ ప్రాంతాల్లో యాత్ర

నగరంలోని పడమర వీధి, సుబ్రహ్మణ్యం కాలనీ ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం ప్రచార యాత్ర జరిగింది. ఈ ప్రచార యాత్రను ఉద్దేశించి సిపిఎం నాయకులు పి.కిషోర్, వైఎస్.కనకారావు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి కరెంటు ట్రూ అప్ ఛార్జీలను విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారంలోకొచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా నేటికీ గుంతల రోడ్లు దర్శనమిస్తున్నాయని, పదవుల పంపకానికే కూటమి ప్రభుత్వానికి సమయం సరిపోవడం లేదని విమర్శించారు. ఏలూరు నగరంలో రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయని, వీధిలైట్లు వెలగడం లేదని, డ్రెయినేజీ వ్యవస్థ దారుణంగా ఉందని విమర్శించారు. నగరంలో 50 డివిజన్లలో 13వ తేదీ వరకు ఈ యాత్ర కొనసాగుతుందని తెలిపారు. నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేందుకు 14వ తేదీన ఏలూరు మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, ప్రభుత్వానికి వినతిపత్రాన్ని అందిస్తామని తెలిపారు.

నిడమర్రు : మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

యాత్రలో మహిళా సంఘం నాయకులు శారద, హైమావతి, సిహెచ్.అన్నవరం, ఎం.శ్రీనివాసరావు, డి.దుర్యోధన పాల్గొన్నారు.

నిడమర్రు : టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు డిమాండ్ చేశారు. సిపిఎం ప్రజా పోరుయాత్ర మండలంలోని చానమిల్లి, భావయ్యపాలెం, క్రోవిడి గ్రామాల్లో నిర్వహించారు. ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ నిలుపుదల చేయాలని, కరెంటు ఛార్జీలు పెంచకుండా నాణ్యమైన కరెంట్ ఇస్తానని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కోన శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ, వెలగలేటి మోహన్, కానూరు రాజు పాల్గొన్నారు.

14న ధర్నా జయప్రదానికి పిలుపు

టి.నరసాపురం : ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 14న సిపిఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు పేరుతో చేపట్టిన ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం మండల నాయకులు అనుమోలు మురళి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ప్రజాపోరు వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ విద్యుత్ ట్రూ ఆప్ ఛార్జీలు రద్దు చేయాలని, ప్రభుత్వ ఇసుకపాలసీ అమలు చేయాలని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, తదితర అంశాలపై చేపట్టిన ధర్నా కార్యక్రమానికి మండలంలోని ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కలిదిండి : ఈ నెల 14 వ తేదీన ప్రజా సమస్యల పరిష్కారానికి తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ప్రజలందరూ పాల్గొనాలని సిపిఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండలంలోని కోరుకొల్లులో ప్రజాపోరు యాత్ర పోస్టర్లను అంటిస్తూ, కరపత్రాలను పంచుతూ ప్రచారం చేశారు. నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్ ధరలు, విద్యుత్ ట్రూ ఆప్ ఛార్జీలు తగ్గించాలని, మహిళలు, బాలలు, మైనార్టీలు, దళితులపై జరుగుతున్న దాడులు తదితర అంశాలపై ఈ నెల 14న ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి అందరూ కలిసి రావాలని కోరారు. సిపిఎం కార్యకర్తలు జక్కుల మహేష్, గోసంగి వినోద్, చిన్నం మాధవ, చిప్పాడ రమేష్, పంతగాని ప్రకాష్, పెనుమాల రమేష్, సింగవరపు లాజరు, పాము సుధాకర్, ఎస్.భగత్ సత్యకుమార్ పాల్గొన్నారు.

చిరాగ్ ఫౌండేషన్ ఔదార్యం

విద్యార్థుల కోసం రూ.లక్షతో పక్కా షెడ్డు నిర్మాణం

ప్రజాశక్తి - కుక్కునూరు



షెడ్డును ప్రారంభిస్తున్న ఎస్ఐ రామారావు

ఆంధ్ర, తెలంగాణ గ్రామాల మధ్య ఉన్న బండారుగూడెం, చీపురుగూడెం గ్రామాల్లో పాఠశాలకు పక్కా భవనం లేక రెండు గ్రామాల విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి తరగతి గది లేక వర్షమొస్తే తడవడం, ఎండొస్తే ఎండడం రెండు గ్రామాల విద్యార్థుల పరిస్థితి. ఈ విషయాన్ని సామాజిక కార్యకర్త క్రాంతి ద్వారా తెలంగాణ ఎస్ఐ (ఖమ్మం) పుష్పాల రామారావు వెంటనే చిరాగ్ ఫౌండేషన్ వారికి విషయం తెలిపారు. స్పందించిన ఫౌండేషన్ వారు గిరిజనులకు సహాయం చేయాలనే ఉద్దేశంతో సుమారు రూ.లక్ష వ్యయంతో పక్కా షెడ్డును నిర్మించారు. ఆ షెడ్డును ఆదివారం తెలంగాణ ఎస్ఐ రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా చిరాగ్ ఫౌండేషన్ సభ్యులు పురుషోత్తం మాట్లాడుతూ సుమారు 45 మంది వలస ఆదివాసీల పిల్లలు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయులను నియమించిందన్నారు. పూరిగుడిసెలో అపరిశుభ్ర వాతావరణంలో పాఠశాల నిర్వహిస్తున్నారని చెప్పారు. గతేడాది ఆదివాసీలకు రగ్గుల వితరణ కోసం వచ్చిన చిరాగ్ ఫౌండేషన్ సభ్యులు ఇక్కడ పరిస్థితిని గమనించారన్నారు.. పాఠశాల నిర్మాణం కోసం పక్కా షెడ్డు నిర్మించాలని నిర్ణయించినట్లు చెప్పారు. దీనిలో భాగంగా ఒక పక్కా షెడ్డు నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ పి.క్రాంతి, పుష్పాల సాయి, గోపీ పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌కె.వలీ సిబ్బంది

అటవీశాఖ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

అటవీ క్షేత్రాధికారి ఎస్‌కె.వలీ

ప్రజాశక్తి - పోలవరం

అటవీశాఖ అమరవీరుల త్యాగాలు మరువలేనివని అటవీక్షేత్రాధికారి ఎస్‌కె.వలీ అన్నారు. ఆదివారం అటవీశాఖ అమరవీరుల దినోత్సవాన్ని అటవీశాఖ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో అసువులు బాసిన అటవీశాఖ అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం అటవీశాఖ కార్యాలయం నుంచి స్థానిక ఏటిగట్టు సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అటవీక్షేత్రాధికారి మాట్లాడుతూ రెండు రాష్ట్రాల పోలీసులను, అటవీశాఖ అధికారులను ముప్పుతిప్పలు పెట్టిన కరడుకట్టిన గంధపుచెక్కల స్మగ్లర్ వీరప్పన్ని పట్టుకుని ప్రభుత్వానికి అప్పజెప్పి వీరప్పన్ కుటిలత్వానికి విధి నిర్వహణలో బలైన రాజమండ్రి అటవీశాఖ అధికారి పందిళ్లపల్లి శ్రీనివాస్, విధి నిర్వహణలో అమరులైన అటవీశాఖ అధికారులు సిబ్బంది దేశంలో అటవీశాఖ పట్ల గౌరవప్రతిష్టలు పెంచారన్నారు. వారి సేవలు దేశం మరువదన్నారు. ప్రతిఒక్కరూ వారిని ఆదర్శంగా తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒలు ఎ.సూరిబాబు, మీనాక్షి, గోపీకుమార్, ఎఫ్ఎస్‌లు కె.సోమరాజు, మధుకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ముదినేపల్లిలో సైకిళ్ల చోరీలు

లబోదిబోమంటున్న బాధితులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల కేంద్రమైన ముదినేపల్లిలో సైకిళ్ల చోరీలు జోరుగా జరుగుతున్నాయి. రాత్రి, పగలు అనే తేడా లేకుండా సైకిళ్లు చోరీకి గురవుతున్నాయి. ఇళ్ల ముందు తాళం వేసి ఉంచిన సైకిళ్లు మయం కావడంతో బాధితులు గగ్గోలు పెడుతున్నారు. వారం రోజుల వ్యవధిలో ఆరు సైకిల్ చోరీలకు గురి కావడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ముదినేపల్లికి చెందిన మద్దాల రామదాసు, జంపన నరసింహారావు, కట్టా రామకృష్ణ, జవ్వాది క్రాంతికుమార్ సైకిళ్లు గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకుపోయారు. క్రాంతికుమార్ కాలేజీకి వెళ్తూ బస్టాండ్‌లో సైకిల్‌కి తాళం వేసి వెళ్లాడు. సాయంత్రం వచ్చేసరికి సైకిల్ మయమైంది. దీంతో సదరు విద్యార్థి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే రామకృష్ణ, నరసింహారావు ఇంటి ముందు ఉంచిన సైకిళ్లు మాయం కావడంతో ఆందోళన చెందుతున్నారు. శనివారం రాత్రి అంబేద్కర్ నగర్‌కు చెందిన మద్దాల రామదాసు ఇంటి ముందు సైకిల్ ఉంచి స్నానం చేసి వచ్చే లోపు సైకిల్ మాయమైంది. దీంతో సైకిళ్ల బాధితులు ఏమి చేయాలో తెలియక తికమక పడుతూ తలలు పట్టుకుంటున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేకపోగా, పనులు మానుకొని పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరగాల్సి చూస్తుదంటూ కొందరు పోలీసులు ఫిర్యాదు చేసేందుకు జంకుతున్నారు. కార్తీకమాసం కావటం, వ్యవసాయ పనులు ఇంకా రాకపోవడంతో మందు బాబులు సైకిళ్ల చోరీలకు పాల్పడుతున్నట్లు పలువురు చెబుతున్నారు. అదేవిధంగా మండలంలోని పలు గ్రామాల్లో కూడా సైకిల్ చోరీలు జరుగుతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా పోలీసులు స్పందించి సైకిల్ దొంగతనాలు జరగకుండా నిఘా ఏర్పాటు చేసి సైకిల్ దొంగతనాలు అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నేరాలు - ఘోరాలు

పూల దుకాణాల వద్ద మంటలు

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు నగరంలోని ఒకటో పట్టణ పరిధిలో పూల దుకాణాల సమూహం వద్ద ఉన్న గోడౌన్‌లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తమై మంటలను అదుపు చేశారు. ఏలూరు నగరంలోని వైఎంహెచ్ఎ హాల్ వెనుక భాగంలో పూల దుకాణాల సమూహానికి ఆనుకుని ఒక హోం అప్లయెన్సెస్ దుకాణం కూడా నిర్వహిస్తున్నారు. దుకాణం వెనుక భాగంలో దానికి సంబంధించిన గోడౌన్ కూడా ఉంది. ఈ గోడౌన్‌లో ఆదివారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గోడౌన్ చిన్నపాటిది కావడంతో మంటలు పూర్తిగా వ్యాపించలేదు. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుదల చేశారు. ఆ దుకాణంలో ఉన్న కొన్ని ఇనుప సామగ్రి మంటలకు దగ్ధమయ్యాయి.

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

అప్పుల బాధ తాళలేక మనస్తాపానికి గురై కలుపు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని వల్లంపట్ల గ్రామానికి చెందిన చావల వెంకట దుర్గారావు (35) బస్సు డిపోలో ముఠా మేస్త్రిగా పని చేస్తున్నాడు. ఆయనకు 15 ఏళ్ల క్రితం చావల కనకదుర్గతో వివాహమైంది. ఈ నేపథ్యంలో కుటుంబ ఆర్థిక ఇబ్బందుల కారణంగా చేసిన అప్పులు తీర్చలేనని మనస్తాపానికి గురైన దుర్గారావు ఇటీవల గ్రామంలో కౌలుకు తీసుకున్న జీడి తోటకు కొట్టిన కలుపు మందు మిగిలినది పాలల్లో కలుపుకుని ఈ నెల ఒకటో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు అతడికి స్థానికంగా వైద్యం చేయించి మెరుగైన చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని భార్య కనకదుర్గ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు.

ఆరు మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే మద్యం విక్రయించాలని, 21 ఏళ్ల లోపు వారికి మద్యం విక్రయించకూడదని, ప్రతి మనిషికి మూడు మద్యం బాటిల్స్ మించి ఇవ్వకూడదని, బెల్టుషాపులకు మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య హెచ్చరించారు. నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన దాడుల్లో మండల పరిధిలోని ఈదర గ్రామంలో బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న దొండపాటి ఆంజనేయులును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

తెలంగాణ మద్యం పట్టివేత

కుక్కునూరు : తెలంగాణ మద్యం విక్రయిస్తున్న మహిళను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుంచి 11 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని వేలేరు గ్రామంలో మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు సిఐ రమేష్‌బాబు సారథ్యంలో ఎస్ఐ రామకృష్ణ ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు తమ సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో తెలంగాణ మద్యం విక్రయిస్తున్న మహిళను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుంచి 11 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - ముసునూరు

పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని గోపలవరం గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ ఎం.చిరంజీవి తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3400 నగదు స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలోని చింతలవల్లి గ్రామంలో దాడి చేసిన పోలీసులు పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1050 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం

పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి

ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190

పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పోనుకుమాడులో సబ్‌స్టేషన్ ఏర్పాటయ్యేనా..!

2016లో అధికారులకు అప్పటి మంత్రి పీతల సుజాత ఆదేశాలు

రెండు నెలల క్రితం గ్రామసభలో కలెక్టర్‌ను కోరిన గ్రామస్తులు

ఇప్పటికీ పనులు మొదలు కాని వైనం

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని పోనుకుమాడులో సబ్ స్టేషన్ ఎప్పుడు ఏర్పాటు చేస్తారో, ఎప్పుడు ప్రగడవరం పంచాయతీ, కరెంటు సమస్యలు తొలగిపోతాయోనని పంచాయతీ ప్రజలు ఎదురుచూస్తున్నారు. మండలంలోని ప్రగడవరం పంచాయతీలో శంకుచక్రపురం సబ్‌స్టేషన్ పరిధిలో 3600 అగ్రికల్చర్ డొమెస్టిక్ సర్వీసులు ఉన్నాయి. ప్రగడవరం పంచాయతీ కాకుండా, ఇది సబ్‌స్టేషన్ పరిధిలో తిమ్మిరెడ్డిపల్లి పంచాయతీ, టి.నరసాపురం మండలానికి చెందిన తెల్లెం పంచాయతీ సర్వీసులు కూడా ఇదే సబ్‌స్టేషన్ పరిధిలో ఉండడంతో ఓవర్ లోడ్‌తో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

అగ్రికల్చర్ సర్వీసులు, డొమెస్టిక్ సర్వీసులు కలిపి ఉండడంతో చిన్నపాటి గాలి, వర్షం వచ్చినా విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. దీంతో ఆ సమస్య పరిష్కరమయ్యేవరకూ గంటైనా, రెండు గంటలైనా విద్యుత్ సరఫరా ఇచ్చేవరకూ ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. అగ్రికల్చర్ సర్వీసులు, డొమెస్టిక్ సర్వీసులు, వేరు చేస్తే, విద్యుత్ సరఫరా అంతరాయనికి కొంత ఉపశమనం కలుగుతుందని రైతులు చెబుతున్నారు. మేజర్ పంచాయతీ కావడంతో సర్వీసులు కూడా ఎక్కువగా ఉండడంతో, ఇటు డొమెస్టిక్ సర్వీసులో సమస్య వచ్చినా అగ్రికల్చర్ సర్వీసులో సమస్యలు వచ్చినా విద్యుత్ శాఖ సిబ్బందికి ఇక్కట్లు తప్పడం లేదు. ఈ పంచాయతీలో పనిచేయడం కూడా వారికి సవాల్‌గా మారింది.

2016లో అప్పటి టిడిపి ప్రభుత్వ హయంలో అప్పటి మంత్రిగా ఉన్న పీతల సుజాతను సబ్‌స్టేషన్ కావాలని రైతులు, ప్రజలు కోరారు. దీంతో మంత్రి పోనుకుమాడులో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అప్పటినుంచి సబ్ స్టేషన్ పనులు మొదలు పెట్టడానికి ఏదో ఒక రూపంలో ఏదో ఒకటి అడ్డుపడుతూనే ఉన్నాయి. ఈ ఏడాది ఆగస్టులో జరిగిన గ్రామసభ సమావేశంలో ప్రగడవరం పంచాయతీ నాయకులు, ప్రజలు పోనుకుమాడు సబ్‌స్టేషన్ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్‌ని కోరారు. దీనిపై జంగారెడ్డిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అపరేషన్ డిఇ రాధాకృష్ణను వివరణ కోరగా మూడు నెలల్లో పోనుకుమాడు సబ్‌స్టేషన్ పూర్తి చేస్తామని కలెక్టర్ ఎదుట చెప్పారు. గ్రామ సభ జరిగి ఇప్పటికే రెండు నెలలు పూర్తవుతున్నా ఇప్పటికీ కనీసం పనులు మొదలు పెట్టలేదు.

పోనుకుమాడు సబ్‌స్టేషన్ పూర్తయితే 650 హౌసింగ్ సర్వీసులు, 25 అగ్రికల్చర్ సర్వీసులు, ఒక పారిశ్రామిక సర్వీసు, కులాయి ఇతర సర్వీసులు 18 సపరేట్ అవుతాయని అధికారులు చెబుతున్నారు. దీంతో ప్రగడవరం పంచాయతీ ప్రజలకు రైతులకు ఎంతో మేలు జరుగుతుందని చెబుతున్నారు. అగ్రికల్చర్ సర్వీసులు, డొమెస్టిక్ సర్వీసులు, సాధ్యమైనంతవరకు వేరు చేయాలని, ఆ ప్రక్రియను త్వరగా పూర్తిచేస్తే ప్రగడవరం పంచాయతీల్లో కరెంటు సమస్యలు తొలగిపోతాయని ప్రగడవరం పంచాయతీ ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

సబ్‌స్టేషన్ త్వరగా పూర్తి చేయాలి

కోప్పర్ల నాగరాజు, పోనుకుమాడు

పోనుకుమాడు సబ్‌స్టేషన్ త్వరగా పూర్తి చేయాలి. మూడు నెలలలో సబ్‌స్టేషన్ పూర్తవుతుందని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ హామీ త్వరగా నెరవేర్చాలి సబ్‌స్టేషన్ ఏర్పాటైతే ప్రగడవరం పంచాయతీ ప్రజలకు కరెంటు సమస్యలు పూర్తిగా తొలగిపోతాయి.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు అభినందన

ప్రజాశక్తి - దెందులూరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల్లో రూరల్ పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్) ఉపాధ్యాయునిగా పని చేస్తున్న గగ్గులోతు కృష్ణకు ఎపిటిఎఫ్ 1938 జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రత్నం బాబు, జి.మోహన్ అభినందనలు తెలిపారు. రాష్ట్ర ఉత్తమ అవార్డు గ్రహీతలకు ఎపిటిఎఫ్ 1938 జిల్లా శాఖ పక్షాన ప్రత్యేక అభినందనలు తెలిపారు.

13న పింఛనుదారులు జీవిత ధృవీకరణ పత్రాలు సమర్పించొచ్చు

ప్రజాశక్తి - ఏలూరు

పెన్షన్, పెన్షనర్ల సంక్షేమ శాఖ నుంచి అసిస్టెంట్ డైరెక్టర్ మంజు గుప్తా ఈ నెల 13వ తేదీన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్ఆర్.పేట బ్రాంచిని సందర్శిస్తారని లీడ్ బ్యాంక్ మేనేజర్ డి.నీలాద్రి తెలిపారు. పింఛనుదారులందరూ తమ జీవిత ధృవీకరణ పత్రాలను సమర్పించడానికి ఈ కేంద్రాన్ని సందర్శించవచ్చన్నారు. ఇంతకుముందు, జీవిత ధృవీకరణ పత్రాలను భౌతిక రూపంలో సమర్పించాల్సి ఉండేదని, దీనికోసం పింఛనుదారులు గంటల తరబడి బ్యాంకుల వెలుపల క్యూలలో నిలబడాల్సి వచ్చేదని తెలిపారు. ప్రస్తుతం డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్‌ను ప్రమోట్ చేస్తున్న దృష్ట్యా ఇప్పుడు వారి గృహాల సౌకర్యం నుంచి ఒక బటన్‌ను క్లిక్ చేయడం ద్వారా ఇది సాధ్యమైందన్నారు. ఆండ్రాయిడ్ మొబైల్‌లను ఉపయోగించి ఫేస్ అథెంటికేషన్ ద్వారా లైఫ్ సర్టిఫికేట్‌ను సమర్పించే ప్రక్రియలో, ఆధార్ నెంబర్, ఓటిపి కోసం మొబైల్ నెంబర్, పిపిఒ నెంబర్, బ్యాంక్/పోస్టాఫీసులో ఖాతా నెంబర్‌కు సంబంధించిన వివరాలు మొదటిసారిగా అవసరమన్నారు. పింఛనుదారులందరూ తమ జీవిత ధృవీకరణ పత్రాలను డిజిటల్ మాధ్యమం ద్వారా సమర్పించేందుకు ఈ కేంద్రాన్ని సందర్శించాలని పెన్షన్ శాఖ కోరినట్లు తెలిపారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి : సిపిఐ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. సిపిఐ ఏలూరు ఏరియా కార్యవర్గ సమావేశం ఆర్ఆర్.పేటలోని స్ఫూర్తి భవన్‌లో అడ్డగర్ల లక్ష్మీఇందిరా అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో భాగంగా పేద ప్రజలకు పట్టణ ప్రాంతాల్లో పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలం ఇస్తామని హామీ ఇచ్చి ఎన్నికల్లో గెలిచి ఇప్పటివరకు ఆ హామీ అమలుకు ఎటువంటి చర్యలు చేపట్టలేదని విమర్శించారు. గత ప్రభుత్వంలో పట్టాలు పొందిన లబ్ధిదారుల నుంచి అర్జీలను సేకరించి నవంబర్ 18న గ్రామ వార్డు సచివాలయాల వద్ద ధర్నా నిర్వహించి, అర్జీలను ప్రభుత్వానికి ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర సమితి ఇచ్చిన కార్యక్రమంలో భాగంగా రేపటి నుంచి పట్టాదారుల వివరాలను సేకరించి అర్జీలను నమోదు చేయించే కార్యక్రమం ఏలూరు నగరంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఏలూరు ఏరియా సహాయ కార్యదర్శి గొర్రెల వరప్రసాద్, బళ్ల కనకదుర్గారావు, తెర్లాపు శ్రీను పాల్గొన్నారు.

బొర్రా గోపీమూర్తికి మద్దతు : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి - దెందులూరు

డిసెంబర్ నెలలో జరగనున్న ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తికి ఎపిటిఎఫ్-1938 ఉపాధ్యాయ సంఘం తరపున మద్దతు ప్రకటిస్తున్నట్లు ఏలూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రత్నంబాబు జి.మోహన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏలూరు, కోనసీమ, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఎపిటిఎఫ్-1938 జిల్లా శాఖల ఏకగ్రీవ తీర్మానం మేరకు ఉపాధ్యాయ విద్యా సమస్యలపై నిరంతరం పోరాడే పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తికి మద్దతును ఆదివారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హృదయరాజు, చిరంజీవి నిర్ణయించినట్లు తెలిపారు. ఉపాధ్యాయ, విద్యా సమస్యలపై ప్రభుత్వానికి నిరంతరం తన గళాన్ని వినిపించే బొర్రా గోపీమూర్తిని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ఎపిటిఎఫ్-1938 కార్యకర్తలందరూ బొర్రా గోపీమూర్తి అఖండ విజయానికి కృషి చేయాలని తెలిపారు.

బాధిత కుటుంబానికి నిత్యావసరాలు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి సహాయం అందించడం ఎంతో అభినందనీయమని ఆగిరిపల్లి తహాశీల్దార్ పిఎన్‌వి.ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని ఆగిరిపల్లికి చెందిన గొల్లపల్లి విజయ్‌కుమార్ ఇల్లు అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న రెడ్‌క్రాస్ సొసైటీ తరపున ఛైర్మన్ కృష్ణారెడ్డి వితరణగా అందించిన నిత్యావసర వస్తువులను తహాశీల్దార్ పిఎన్‌వి.ప్రసాద్ బాధితుడు గొల్లపల్లి విజయ్‌కుమార్‌కు ఆదివారం స్థానిక తహాశీల్దార్ కార్యాలయంలో అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహాశీల్దార్ జి.పవన్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ యూనస్, గ్రామ రెవెన్యూ అధికారి పి.వంశీ పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులను అందిస్తున్న తహాశీల్దార్ ప్రసాద్

రహదారిపై గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని ప్రధాన రహదారులపై ఏర్పడ్డ గుంతల పూడ్చివేత కార్యక్రమాన్ని అధికారులు ఆదివారం చేపట్టారు. పామర్రు-కత్తిపూడి 214 జాతీయ రహదారిపై మండల పరిధిలో ఏర్పడ్డ భారీ గుంతలను పూడ్చివేత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ముదినేపల్లి -గుడివాడ రహదారిలో ఏర్పడిన గుంతల్లో కార్మికులు కంకర వేసి రోలర్‌తో తొక్కిస్తూ చదును చేస్తున్నారు. ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు చేస్తూ వాహనదారుల రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా పనులు చేపట్టారు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టడం వల్ల ఉపయోగం ఏమీ ఉండదని, ప్రభుత్వం రోడ్లకు శాశ్వత మరమ్మతులు చేపట్టి వాహనదారులు, ప్రజలు పడుతున్న ఇబ్బందుల నుంచి విముక్తి కలిగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపై ఏర్పడ్డ గుంతలకు చేస్తున్న మరమ్మతులు

పైకి తేలిన ఇనుపతీగలు

గాయాలపాలవుతున్న ప్రయాణికులు

పోలవరం కాలువ వంతెనపై దుస్థితి

ప్రజాశక్తి - దెందులూరు

పెదవేగి మండలం కొప్పాక-అంకన్నగూడెం గ్రామాల మధ్య పోలవరం కుడి కాలువపై నిర్మించిన వంతెనపై అమర్చిన ఇనుపతీగలు పైకి తేలడంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ వంతెనపై వెళ్లే వాహనాల రాకపోకలు రద్దీ వల్ల నిర్మాణంలో అమర్చిన ఐరన్ బయటకు తేలింది. ఇలా బయటకు వచ్చిన ఐరన్ రాడ్‌లు మధ్యలోకి విరిగి ద్విచక్రవాహనాలకు, బాటసారులకు, పశువుల కాళ్లకు తగిలి గాయాలపాలవుతున్నారు. ప్రమాదాన్ని గుర్తించి దీనిపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని ఈ వంతెనపై నిత్యం ప్రయాణించే ప్రయాణికులు కోరుతున్నారు.

పైకి లేచిన ఇనుప తీగలు

తక్కువ ధరకు బంగారు వస్తువులు చేసిస్తామని మోసం

రూ.30 లక్షలతో పరారైన సోదరులు

పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

ప్రజాశక్తి - కామవరపుకోట

కామవరపుకోట పరిసర ప్రాంతాల్లో తక్కువ రేటుకు బంగారు వస్తువులు, ఆభరణాలు ఇస్తామని నమ్మబలికి పలువురి వద్ద నుంచి విడతల వారీగా సుమారు రూ.30 లక్షల వరకు వసూలు చేసి పరారైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు నగరానికి చెందిన ఎస్‌కె.నజీర్, ఎస్‌కె.ఫిరోజ్ అనే ఇద్దరు సోదరులు కలిసి పదేళ్ల క్రితం కామవరపుకోట ఇండియన్ బ్యాంకు ఎదురుగా మదీనా జ్యూయలర్స్ పేరుతో షాపు ప్రారంభించారు. చుట్టుప్రక్కల ప్రాంతాల వారికి బంగారు వస్తువులు తయారు చేసి మార్కెట్ ధర కన్న తక్కువ ధరకు అమ్ముతు వారిలో నమ్మకాన్ని కలిగించారు. సుమారు 50 మంది వద్ద నుంచి తక్కువ రేటుకు బంగారు ఆభరణాలు ఇస్తానని నమ్మబలికి ఒక్కొక్కరి వద్ద రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు వరకు అడ్వాన్సుగా సుమారు రూ.30 లక్షల వరకు వసూలు చేసినట్లు తెలిపారు. డబ్బులు చెల్లించి మోసపోయిన వారిలో కూలీ పనులు చేసుకునే వారు అలాగే ఉద్యోగ, వ్యాపారాలు చేసుకునే వారు ఉన్నారు. రోజులు గడుస్తున్నా వస్తువులు ఇవ్వకపోవడం, ఫోన్ స్విచ్ ఆఫ్ చేయటంతో అనుమానం వచ్చిన బాధితులు షాపు దగ్గరికి వెళ్లగా తాళాలు వేసి మూసి ఉండటంతో మోసపోయామని గ్రహించిన బాధితులు తడికలపూడి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తడికలపూడి ఎస్ఐ పి.చెన్నారావు తెలిపారు.

మూసివేసిన షాపు

వైకూడలిలో వెలగని వీధి దీపాలు

రాత్రి సమయాల్లో ప్రజల అవస్థలు

మరమ్మతులు చేయాలని వేడుకోలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల కేంద్రమైన ముదినేపల్లి వైకూడలిలో వీధి దీపాలు వెలగడం లేదు. వీధి దీపాలు పాడైపోవడంతో కొంతకాలంగా వీధి దీపాలు వెలగని పరిస్థితి ఉంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే వాహనదారులకు వైకూడలి ముఖ్య ప్రదేశం. విజయవాడ-భీమవరం ముదినేపల్లి నుంచి బంటుమిల్లి మీదుగా మచిలీపట్నం, ముదినేపల్లి- గుడ్లవల్లేరు, ముదినేపల్లి మీదుగా కైకలూరు, ఆకివీడు వెళ్లే ప్రధాన ప్రదేశంలో ఉన్న వైకూడలిలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రి సమయంలో ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు, మహిళలు వైకూడలి ప్రాంతంలో చిరు వ్యాపారులు అవస్థలు పడుతున్నారు. సాయంత్రం ఆరు తర్వాత వైకూడలి ప్రాంతమంతా చీకటి మయంగా మారుతుంది. దారి కనబడక వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. చీకటిలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున గ్రామపంచాయతీ వెంటనే స్పందించి మరమ్మతులకు గురైన వీధి దీపాలను వెంటనే వినియోగంలోనికి తీసుకొచ్చి ప్రజలు, వాహనదారులు పడుతున్న ఇక్కట్లు తొలగించాలని కోరుతున్నారు.



వెలగని వీధిలైట్లతో చీకటిగా మారిన వైకూడలి

వీరేశ్వరస్వామి సన్నిధిలో జైళ్లశాఖ డిఐజి రవికిరణ్

ప్రజాశక్తి - పోలవరం

పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి శివక్షేత్రాన్ని ఆంధ్రా రీజియన్ జైళ్లశాఖ డిఐజి ఎం.రవికిరణ్ కుటుంబ సమేతంగా ఆదివారం సందర్శించారు. వారికి ఆలయ సిబ్బంది వెంకట్రాజు తదితరులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్న డిఐజి దంపతులను అర్చకులు ఆలయ జ్ఞాపికతో కండువాలతో సత్కరించారు. డిఐజితో పాటు స్థానిక పోలీసులు మురళీకృష్ణ, డిఐజి రక్షణ సిబ్బంది ఉన్నారు.

'50 వేల సభ్యత్వాలు చేయాలి'

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నియోజకవర్గంలో 50 వేల సభ్యత్వాలు లక్ష్యంగా నాలుగు మండలాల నాయకులు పనిచేయాలని ఎంఎల్‌ఎ సొంగా రోషన్ కుమార్ అన్నారు. టిడిపి చింతలపూడి కార్యాలయంలో నాలుగు మండలాల, పట్టణ నాయకులు, కార్యకర్తలతో ఆయన ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 వేల పైబడి సభ్యత్వాలను ఎలా చేరుకోవాలో శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన మేరకు ప్రతి నాలుగు ఓట్లలో ఒకరికి టిడిపి సభ్యత్వం ఉండేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. టిడిపి జీవితకాల సభ్యత్వం తీసుకున్న నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలకు టిడిపి ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. వారి సంక్షేమం కోసం చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల టిడిపి అధ్యక్షులతో పాటు పట్టణ అధ్యక్షులు, పార్టీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ముసునూరు : టిడిపి సభ్యత్వం ద్వారా ప్రతిఒక్కరూ బీమా పొందవచ్చని గోపవరం టిడిపి నాయకులు ఉప్పలపాటి గణేష్ అన్నారు. మండలంలోని గోపవరం గ్రామంలో టిడిపి ఉచిత సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. టిడిపి ఉచిత సభ్యత్వ నమోదు కార్యక్రమంలో వడ్లపట్ల మురళి, సాయల అనిల్, కొసరాజు సత్యనారాయణ, కర్రా యేసుపాదం, రొంప మునియ్య, టిడిపి ప్రతి సభ్యునికి ఉప్పలపాటి గణేష్ పాల్గొన్నారు.

23న జిల్లా విస్తృత సమావేశం : ఎఐటియుసి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎఐటియుసి అనుబంధ ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా విస్తృత సమావేశం నవంబర్ 23న జంగారెడ్డిగూడెంలో నిర్వహించనున్నట్లు యూనియన్ జిల్లా అధ్యక్షులు కూనపాముల విగ్నేష్ తెలిపారు. జంగారెడ్డిగూడెంలో నిర్వహించే సమావేశం ప్రాముఖ్యతను వివరిస్తూ ఏలూరు ఆర్ఆర్.పేట ఎస్ఆర్ టు వద్ద ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్నేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్పొరేషన్లలో, పురపాలక సంఘాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు మాట్లాడుతూ పబ్లిక్ హెల్త్ కార్మికులకు నెలకు రూ.21 వేల వేతనం ఇస్తున్నారని, వాటర్ సప్లై, పంపులు చెరువుల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు కేవలం నెలకు రూ.15 వేలే వేతనం ఇస్తున్నారని చెప్పారు. ఇంజినీరింగ్ విభాగంలో అన్ స్కిల్డ్ వర్కర్లకు రూ.21 వేలు, సెమీ స్కిల్డ్ వర్కర్‌కు రూ.25 వేలు, స్కిల్డ్ వర్కర్‌కు రూ.29 వేలు వేతనం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించేందుకు ఈ నెల 23న జంగారెడ్డిగూడెంలో జరిగే ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా విస్తృత సమావేశానికి ఇంజినీరింగ్ విభాగంలో చేస్తున్న ఉద్యోగ సిబ్బంది హాజరు కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి బి.నారాయణరావు, యూనియన్ సహాయ కార్యదర్శి ఎస్.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పోలవరం పూర్తి చేసేందుకు చర్యలు

కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖా సహాయక మంత్రి శ్రీనివాస్‌వర్మ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖా సహాయక మంత్రి శ్రీనివాస్‌వర్మ చెప్పారు. జంగారెడ్డిగూడెంలో ఆయన ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు ను నిర్వీర్యం చేసిందన్నారు. రివర్స్ టెండరింగ్ పేరుతో సజావుగా జరుగుతున్న ప్రాజెక్టు పనులను కావాలని అడ్డుకుందన్నారు. కొవ్వూరు, భద్రాచలం రైల్వే పనులను త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. ఆయుధ కర్మాగార నిర్మాణంపై సంబంధిత మంత్రితో మాట్లాడతానన్నారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో నిర్వాసితుల కోసం పరిశ్రమల ఏర్పాటుకు స్థల సేకరణ చేస్తామని చెప్పారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణపై కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్, అమిత్ షాతో మాట్లాడుతామని తెలిపారు.